క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఉరుసు



గుండ్రేవులలో స్వామివారి గంధంను దర్గాకు తీసుకెళ్తున్న భక్తులు

సి.బెళగల్: మండలంలోని గుండ్రేవుల గ్రామంలో బడేషా ఖాద్రి (బడేసావ్) 384 ఉరుసు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మూడు రోజుల ఉరుసు కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు బుధవారం భక్తులు పెద్ద ఎత్తున దర్గాకు చేరుకుని మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం గాజుల, బొమ్మల, మిఠాయి దుకాణలలో కొనుగోళ్లు చేశారు. ఉరుసు ఉత్సవాలకు ఎస్‌ఐ పీరయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా మండలం పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో కూడా బడేషా ఖాద్రి ఉరుసు 17వ ఉత్సవాలను గ్రామస్తులు, భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు.

ఆర్‌బీకేల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయండి

కల్లూరు: మండలంలో వివిధ దశాల్లో నిర్మాణాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలను సకాలంలో పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం పర్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటికే కొంగనపాడు, కె.మార్కపురం ఆర్‌బీకేలను వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. పుసులూరు, బొల్లవరం, బస్తిపాడు, చిన్నటేకూరు, నాయకల్లు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయని, వాటిని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో ఆర్‌బీకేలు నిర్మాణాలు వివిధ దశాలో ఉన్నాయన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే చక్కటి ఆరోగ్యం



బోదకాలు బాధితులకు సామగ్రి పంపిణీ చేస్తున్న జిల్లా అదనపు మలేరియా అధికారి చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలకు చక్కటి ఆరోగ్యం కలుగుతుందని జిల్లా అదనపు మలేరియా అధికారి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం బోదకాలు బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన టబ్బు, టవల్‌తో పాటు మందులను జిల్లా అదనపు మలేరియా అధికారి చంద్రశేఖర్, సర్పంచు భాగ్యరత్న చేతుల మీదుగా కోడుమూరు పంచాయతీ ఆవరణలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు వల్ల ఫైలేరియా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రభలుతాయని, ప్రజలంతా దోమలు పెరగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో లద్దగిరి పీహెచ్‌సీ సీహెచ్‌ఓ శాంత, మలేరియా సబ్ యూనిట్ అధికారి కృష్ణమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు నాగమణి, సుబ్బలక్ష్మి తదితరులున్నారు.

బొల్లవరంలో రాములోరి కల్యాణం జరిగేనా?

గడివేముల: హిందువులకు అత్యంత ముఖ్యమైన పండుగ శ్రీరామనవమి. నేడు పండుగ సందర్భంగా ఆలయాలు ముస్తాబు అయ్యాయి. సీతారాముల కల్యాణోత్సవం, ఇతర వేడుకలు నిర్వహించేందుకు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. బొల్లవరం గ్రామంలోని ఆంజనేయ వీరభద్రస్వామి దేవాలయంలో ఉత్సవాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. రాములోరి కల్యాణోత్సవానికి ఆలయ ఈఓ ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దేవాలయానికి 28 ఎకరాల మాన్యం భూమి ఉంది. ప్రతి ఏటా ఆలయానికి రూ.3.50 లక్షల ఆదాయం వస్తుంది. ఇంత ఆదాయం ఉన్న స్వామివారి కల్యాణం జరిగేనా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై ఆలయ కమిటీ చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ..శ్రీరామనవమి పండుగ సందర్భంగా ప్రతి ఏడాది సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తాం. ఆలయ ఈఓ వెంకటరమణ గత కొన్ని రోజుల నుంచి స్పందించక పోవడంతో ఆలయానికి ఎలాంటి ముస్తాబు చేయలేదన్నారు. పండుగ రోజు కల్యాణం చేయడం లేదని, ఈఓపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈ విషయాన్ని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

పోషకాహారం అందించాలి

గూడూరు రూరల్: పెరిగే పిల్లలకు మంచి పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. పెంచికలపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులకు పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటేనే రక్త హీనత లేకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లీలావతి, ఎంఎస్‌కె ఇందుమతి, ఎంఎల్‌హెచ్‌పీ రూబిక్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి వేళాయె!

- నేటి నుంచి శ్రీ రామనవమి వేడుకలు
- స్వామివారి కల్యాణోత్సవానికి ముస్తాబైన ఆలయాలు
- గ్రామాల్లో వివిధ పోటీల నిర్వహణ



కోడుమూరులో శ్రీసీతారామ లక్ష్మణుల మూలవిరాట్‌లు

సి.బెళగల్: మండల పరిధిలోని మారందొడ్డి గ్రామంలో గురువారం నుంచి ముడు రోజుల పాటు శ్రీ రామనవమి వేడుకలను గ్రామ పెద్దలు నిర్వహించనున్నారు.ఇందులో భాగంగా స్థానిక శ్రీ సీతారాము ల ఆలయంలో గురువారం ఉదయం శ్రీ సీతారాము ల కల్యాణం, సాయంకాలం ప్రభోత్సవం చేపట్టనున్నారు. శుక్ర,శనివారాలలో గ్రామ,రాష్ట్ర స్థాయి పో టీల నిర్వహణ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

పోటీలు ఇలా..

మారందొడ్డిలో శ్రీరామ నవమి వేడుకలలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ముగ్గుల పోటీలు, 10 నుంచి 11 గంటల వరకు కుర్చీలాట, మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు అరటిపండ్లు తినే పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ,1,016లు, రెండ వ బహుమతి రూ.516లు దాతలు అందజేయను న్నారు. ఎంట్రీఫీజు రూ.50 ఉంటుందన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు గిరక బండి పోటీలు, సాయంకాలం గుండు ఎత్తే పందెం నిర్వహించనున్నారు. రూ.200ల ప్రవేశ రుసుము ఉంటుందని, గెలుపొందిన వారికి రూ. 5,016లు, రూ.3,016లు, రూ.1,516లు (గిరక బండి పోటీలకు మాత్రమే) బహుమతులను ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శనివారం రాష్ట్ర స్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

అమడగుంట్లలో ఎద్దుల పోటీలు:

శ్రీరామనవమి సందర్భంగా అమడగుంట్ల గ్రామంలో ఈ నెల 31వ తేదీ ఎద్దుల గిరకబండి, బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గిరకబండి పోటీల్లో గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతిగా రూ.3,016లు, 2వ బహుమతిగా రూ.2,016ల ను, అలాగే బండ లాగు పోటీల్లో గెలుపొందిన వృషభాలకు మొదటిబహుమతిగా రూ.10,016 లు, 2వ బహుమతిగా రూ.5,016లు, 3వ బహుమతిగా రూ.3,016లను దాతల సహకారంతో అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

గూడూరు రూరల్: గుడిపాడు, చనుగొండ్ల, గూడూరు గ్రామాల్లో శ్రీరామ నవమిని పురష్కరించుకుని గురువారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని భక్తులు నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల్లోని సీతారాము ల వారి దేవాలయాల్లో ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను ఆలయ కమిటీలు పూర్తి చేశాయి.

ఉదయం ఎనిమిది గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పోటీలలో పాల్గొనే ఎద్దుల యజమానులు రూ.600లు ప్రవేశ రుసుము చెల్లించి తమ వివరాలను 9885867225, 8106804243 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలైన ఎద్దుల యజమానులకు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10వేలు, రూ. 5వేలు, రూ.3 వేలు చొప్పున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

కోడుమూరులో...

కోడుమూరు రూరల్: శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలోని శ్రీరాముల వారి దేవాలయాలు అందంగా ముస్తాబు అయ్యాయి. పట్టణంలోని శ్రీరాములవారి ఆలయంలో గురువారం శ్రీసీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఎస్ఎస్‌కె సమాజ్ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని వర్కూరులో వెలసిన శ్రీరాములవారి ఆలయంలో గురువారం ఉదయం శ్రీసీతారాముల కల్యాణం, సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. అలాగే మండలంలోని క్రిష్ణాపురం, అమడగుంట్ల గ్రామాల్లోనూ శ్రీరామనవమిని పురస్కరించుకుని గ్రామస్తులు శ్రీసీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఆమడగుంట్ల గ్రామంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రిటైర్డ్ ఎస్ఈ కానాపురం కృష్ణారెడ్డి ఆలయ ఆవరణలో భక్తులకు గురువారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నేడు హుస్సేనాపురంలో కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలోని హుసేనాపురం గ్రామంలో గురువారం స్థానిక బైరెడ్డి నగర్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీలలో విజేతలైన జట్లకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.500లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు9390351265, 9346094529 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నన్నూరులో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

మండలంలోని నన్నూరు గ్రామంలో గురువారం ఉదయ 9 గంటల నుంచి రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. న్యూకేటగిరి ఎద్దుల పోటీల్లో గెలుపొందిన వాటికి తొలి పది స్థానాలకు వరుసగా రూ.1లక్ష, రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. అదేవిధంగా 31వ తేదీన జరిగే పాలపళ్ల విభాగం పోటీలలో గెలుపొందిన ఎద్దులకు తొలి పది స్థానాలకు గాను వరుసగా రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు చొప్పున అందజేస్తామని ప్రకటించారు. పోటీలలో పాల్గొనదలచిన ఎద్దుల యజమానులు రూ.500లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మాజీ సర్పంచు చెన్నారెడ్డి సహకారంతో గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.

31న పౌరాణిక నాటకాల ప్రదర్శన



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు (న్యూటౌన్): పౌరాణిక నాటకానికి ప్రతిస్పందించేదే జీవితమని కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ అన్నారు. బుధవారం కర్నూలు ఎంపీపీ కార్యాలయంలో పౌరాణిక నాటకాల ప్రదర్శనకు సంబంధించి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరామ నవమి సందర్భంగా ఈ నెల 31వ తేదీ రాత్రి 9గంటలకు ఉల్చాల గ్రామంలో పౌరాణిక నాటకాల ప్రదర్శన జరుగుతుందన్నారు. పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వాహకులు ఈశ్వరయ్య మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి 9గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఆరు పౌరాణిక నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఇందులో శ్రీకృష్ణ శయన ఘట్టం (పడక సీను), సుభద్రరాయభారం, శ్రీరామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం (యుద్ధసీను), భవాని - చింతామణి, సత్యహరిశ్చంద్ర (కాటి సీను) వంటి నాటక ప్రదర్శనలు చేపడుతున్నామని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షులు డి.వాసు, సర్పంచ్ విద్యాసాగర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు చిన్న లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

గోరుముద్దపై శ్రద్ధ వహించాలి

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం నిర్వహణపై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీలు శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ రాముడు, తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అన్నారు. బుధవారం ఎంఈఓ జ్యోతి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, భోజన నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కూడిన భోజన రుచి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.

అమ్మవారి ఉత్సవాలకు సహకరించాలి

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, ప్రజలు సహకరించాలని ఆలయ కార్యనిర్వహణ అధికారి దినేష్ కోరారు. కె.నాగలాపురంలోని ఆంజనేయస్వామి గుడి ఆవరణలో బుధవారం గ్రామ పెద్దలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 5 నుంచి 7వ తేదీ వరకు అమ్మవారి జాతర ఉత్సవాలను నిర్వహించనున్నామన్నారు. ఈ జాతర ఉత్సవాలకు గ్రామ పెద్దలు, నాయకులు, ప్రజలు, ఆయకట్టుదారులు తమ సహాయ సహకారాలను అందించాలన్నారు. ఈ ఏడాది అమ్మవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, సురేష్, బీసీ మాదన్న, మధు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర నదిలో మునిగి వ్యక్తి మృతి



మృతి చెందిన వడ్డె నీలప్ప

సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామం వద్దనున్న తుంగభద్ర నదిలో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు..మండల కేంద్రం సి.బెళగల్‌లోని ఎన్టీర్ కాలనీలో వడ్డె నీలప్ప (68) నివాసం ఉంటున్నాడు. అతను తెలంగాణ రాష్ట్రం పెద్ద దన్వాడ గ్రామంలో బంధువులు మారెమ్మకు చేస్తుండటంతో అక్కడికి వెళ్లాడు. పూజల అనంతరం పెద్ద దన్వాడ, గుండ్రేవులకు సరిహద్దు గ్రామం కావడంతో అక్కడ నుంచి తుంగభద్ర నది దారిలో వస్తూ గుండ్రేవుల వద్ద నీటిలో మునిగిపోయాడు. అక్కడ ఉన్నవారు గమనించి బయటకు తీసేలోపే మృతి చెందాడు. మృతుడి భార్య సుంకులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.

కారు దగ్ధం

గడివేముల: మండల పరిధిలోని తిరుపాడు గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన కారు, ఎక్సెల్ బైకు బుధవారం పూర్తిగా దగ్ధమయ్యాయి. చుట్టు ప్రక్కల జొన్న పంట పొలంలోని వ్యర్థాలను తగలబెట్టగా మంటలు వ్యాపించి వాహనాలకు అంటుకున్నాయి. గమనించిన వాహనదారులు నంద్యాల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందిన ఫైర్ ఇంజన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదంపై ఆరాతీస్తున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



పొదుపు మహిళలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్



వైఎస్సార్ ఆసరా సభకు భారీగా వచ్చిన మహిళలు

- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్
- గుడిపాడులో వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు

గూడూరు రూరల్: రాష్ట్రంలోని పేద మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని గుడిపాడులో వైకేపీ ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ ఆసరాధుత్సవాలు నిర్వహించారు. ముందుగా స్థానిక బస్టాండ్ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేశారు. అనంతరం సభ ప్రాంగణానికి కాలినడకన వస్తుండగా స్థానికులు ఆయనకు దారి పొడవునా పూలు జల్లుతూ స్వాగతం పలికారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, చేయూత, పొదుపు సంఘాలకు పావలా వడ్డీ రుణాలు తదితర పథకాలను అందిస్తూ వారు స్వయం ఉపాధిలో రాణించేలా కృషి చేస్తున్నారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాలను బలోపేతం చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలకు అక్కడే పరిష్కారం చూపేందుకు, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు సచివాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల హామీలో భాగంగా వరుసగా మూడో ఏడాది వైఎస్సార్ ఆసరా పథకం కింద మండల వ్యాప్తంగా ఉన్న 313 పొదుపు గ్రూపులకు రూ.1.74 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు పొదుపు సంఘాల బ్యాంకు రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మహిళలను దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. గత టీడీపీ పాలనలో ఏ పథకం రావాలన్నా పేదలు లంచాలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అయితే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ రాజకీయ నాయకుని వద్దకు గాని, అధికారుల వద్దకు గాని వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి గ్రామ సచివాలయాల ద్వారా ఒక్క రూపాయి లంచం లేకుండా పూర్తి పారదర్శకతతో పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాలను ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. ప్రతి కుటుంబానికి అండగా నిలిచి మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అందరూ ఆశీర్వదించాలని ఆయన కోరారు. అనంతరం పొదుపు మహిళలు, నాయకులతో కలిసి సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును మహిళలకు ఆయన అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి రాజమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు ఎల్లారెడ్డి, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం, మండల కో ఆప్షన్ సభ్యుడు దౌల, ఎంపీడీఓ మాధవీలత, ఏపీఎం సుధాకర్, నాయకులు యాపదిన్నె భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, దుబాయ్ శీను, శేఖర్, ఓమంతు, రామాంజనేయులు, డిష్ వెంకటేష్, మగ్బుల్, లక్ష్మీకాంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

95 శాతం హామీలు నెరవేర్చాం

- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే సుధాకర్





సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్, ఎంపీ సంజీవ్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే

కర్నూలు(న్యూటౌన్): దేశ చరిత్రలోనే ఎవరూ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన కేవలం మూడేళ్ల వ్యవధిలోనే మ్యానిఫెస్టోలోని 95 శాతం హామీలను అమలు చేశారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కులమతాలకు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శ పాలన కొనసాగుతోందన్నారు. వైస్ ఎంపీపీ-2 నెహమ్యా, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్లు శేషిరెడ్డి, అమరనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ రామ్‌నాథ్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, సచివాలయ కన్వీనర్ మోహన్ బాబు, ఉల్చాల సర్పంచు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు అభివృద్ధికి సహకారం అందించండి

కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సింగరి సంజీవ్ కుమార్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కోరారు. బుధవారం రాత్రి ఎంపీని ఆయన నివాసంలో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కోడుమూరు నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి ఎంపీ నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇదివరకే నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.200 కోట్లు నిధులు మంజూరు చేశారని అన్నారు. రూ.11 కోట్లతో గోరంట్ల బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇచ్చి సహకరించాలని కోరారు. ఎంపీని కలసినవారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాసు, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

- చంద్రబాబు మోసపూరిత మాటలను నమ్మొద్దు
- ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి





ఆసరా చెక్కును పొదుపు మహిళలకు అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సమావేశానికి హాజరైన మహిళలు

గడివేముల: మహిళా సాధికారతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రం గడివేములలోని రాజరాజేశ్వరీ ఉన్నత పాఠశాలలోని సమావేశ ప్రాంగణంలో మూడో విడత ఆసరా సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంఘాలకు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరా మూడు విడత నగదును ఖాతాల్లో జమ చేశారన్నారు. ఇచ్చిన మాటను నిలుపుకున్న వైఎస్ జగన్‌ను మరో మూడు దశాబ్దాల పాటు సీఎంగా ఉండేలా ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, ఇళ్ల పట్టాలు, అమ్మఒడి వంటి పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. 2014 ఎన్నికల సమయంలో పొదుపు రుణాలను మాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు మహిళలను ఘోరంగా మోసం చేశారని గుర్తుచేశారు. బాబు పాలనంతా కరువుమయం అని ఎద్దేవా చేశారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన ప్పటి నుంచి సకాలంలో వర్షాలు కురవడంతో కేసీ కెనాల్‌కు సమృద్ధిగా సాగునీరు వస్తుండటంతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. పనిచేసే వారిని గుర్తించాలన్నారు. మళ్లీ ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పే మోసపూరిత మాటలను నమ్మొద్దన్నారు. అనంతరం 598 గ్రూపులకు సంబంధించి 6,578 లబ్ధిదారులకు మంజూరైన రూ.2.12 కోట్ల నమూనా చెక్కును అందించారు. సీఎం చిత్రపటానికి పొదుపు మహిళతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ కమిటీ చైర్మన్ శిరుప శ్రీనివాసరెడ్డి, ఐక్యసంఘం అధ్యక్షురాలు బిడుదూరు అనురాధ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ విజయసింహారెడ్డి, ఏపీఎం హాజరత్, ఎంపీటీసీలు మహేశ్వర్‌రెడ్డి, తలారి మద్దమ్మ, సర్పంచ్‌లు నాగేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వరరెడ్డి, శివరామిరెడ్డి, రఘమాధవరెడ్డి, కృష్ణారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, మేఘనాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రమేష్, రవీంద్రారెడ్డి, సీపీ రమణయ్య, ఉప సర్పంచ్ బాలచెన్ని పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే కాటసాని గడివేములలో వెలసిన శ్రీ మూల పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేను ఆలయ చైర్మన్ చిన్నన్న, ఈఓ మోహన్, ధర్మకర్తలు ఘనంగా సన్మానించారు.